# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ గురువారం 03 ఏప్రిల్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 253

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు


ఏప్రిల్ 30 వరకు పెంచుతూ ఆదేశాలు



2లో

## ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

విద్యార్థులను చితకబాదిన పోలీసులు



2లో

## లోక్‌సభలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లు

12 గంటల పాటు సుదీర్ఘ చర్చ అనంతరం అర్ధరాత్రి దాటిన తర్వాత బిల్లు ఆమోదం కోసం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. అనుకూలంగా 282 మంది సభ్యులు ఓటు వేయగా.. 232 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించారు. భాజపా నేతృత్వంలోని ఎన్డీయే పక్షాలు, ప్రతిపక్ష ఇండియా కూటమిలోని ప్రధాన పార్టీలు తమ ఎంపీలు అందరికీ విప్ జారీ చేసిన విషయం తెలిసిందే. గురువారం వక్ఫ్ బిల్లు రాజ్యసభకు వెళ్లనుంది. ఈ బిల్లుపై చర్చకు ఎగువసభలో 8 గంటల సమయాన్ని కేటాయించారు.

చట్ట సవరణ ఎవరికీ వ్యతిరేకం కాదు

లేకుంటే పార్లమెంట్ స్థలం కూడావక్ఫ్‌దే అంటారు

కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సంచలన వ్యాఖ్యలు



2లో

## విశాఖలో ప్రేమోన్మాది దాడిలో తల్లి మృతి

కూతురు పరిస్థితి విషమం..ఆస్పత్రిలో చికిత్స

నిందితుడని గంటల్లోనే పట్టుకున్న పోలీసులు

## సెంట్రల్ వర్సిటీ భూములపై విచారణ



**హైదరాబాద్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై విచారణను తెలంగాణ హైకోర్టు గురువారానికి వాయిదా వేసింది. ఈ భూముల్లోని చెట్లను గురువారం వరకు కొట్టివేయొద్దని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కంచ గచ్చిబౌలి భూ వివాదంపై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్ తరపు సీనియర్ కౌన్సిల్ రవిచంద్.. తన వాదనలు వినిపించారు. జీవో 54ను రద్దు చేయాలని కోరుతూ వాదనలు జరిగాయి. వట ఫౌండేషన్

తరపున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు. ఆ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా టీజీఐఐసీకి భూములు అప్పగించారని తెలిపారు. ఈ భూములపై వట ఫౌండేషన్, హెచ్‌సీయూ విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టులో విచారణ జరిగింది. ఈ భూమిని జాతీయ ఉద్యానవనంగా గుర్తించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో హైకోర్టు

విచారణ చేపట్టింది. సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ప్రభుత్వం భూములను టీజీఐఐసీకి అప్పగించిందన్నారు. 2003లో 400 ఎకరాలను అప్పటి ప్రభుత్వం ఐఎంజీ అకడమిక్ భారత్‌కు విక్రయించారని వివరించారు. అంటే.. 5-8-2003లో నాడు ఎకరా భూమిని రూ. 50 వేలకు విక్రయించారని తెలిపారు. ఆ సమయంలో ఒక ఎకరం భూమి రూ. 26 లక్షలు విలువ ఉంటే.. కేవలం రూ. 50 వేలకు విక్రయించారని హైకోర్టు దృష్టికి ఆయన తీసుకు వెళ్లారు. ఇక 2006లో ప్రభుత్వం మారగానే ఈ భూముల విక్రయం.. నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. ఈ నేపథ్యంలో వాటిని వెనక్కి తీసుకుందని తెలిపారు. నాటి నుంచి ఐఎంజీ భారత్ కోర్టులో ఈ భూమి కోసం పోరాడుతుందని గుర్తు చేశారు. ఐఎంజీ కేసులో ఇప్పటి వరకు

ఈ భూమి ఫారెస్ట్ ఏరియా అని ఒక్క వాదన కూడా జరగలేదని..ఈ విషయాన్ని గమనించాలని హైకోర్టును ఆయన కోరారు. అలాగే ఈ భూమి ఎక్కడా ఫారెస్ట్ ఏరియాగా ప్రభుత్వం నోటిపై చేయలేదన్నారు. ఇక గూగుల్ మ్యాప్‌లో మాన్సన్ ఏరియా బట్టీ- ఫారెస్ట్ ఏరియాగా కనిపిస్తుందని కోర్టుకు తెలిపారు.

## కుదిరితే సయోధ్య.. లేకుంటే ధర్మయుద్ధం



42% రిజర్వేషన్లకు సై అనకుంటే ధర్మయుద్ధమే

"సంధి కోసం కనీసం ఐదు గ్రామాలైనా ఇవ్వాలని ఆనాడు కృష్ణుడు అడిగితే దుర్యోధనుడు వినకుండా విర్రవీగాడు. చివరకు కురుక్షేత్రంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు.

డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి.. గద్దె దిగైనా పోవాలి

రాష్ట్రంలో అమలు చేసుకుంటే ప్రధానికేం ఇబ్బంది?

ఢిల్లీ జంతర్‌మంతర్ మహాధర్నాలో సీఎం రేవంత్‌రెడ్డి

దిల్లీ: "సంధి కోసం కనీసం ఐదు గ్రామాలైనా ఇవ్వాలని ఆనాడు కృష్ణుడు అడిగితే దుర్యోధనుడు వినకుండా విర్రవీగాడు. చివరకు కురుక్షేత్రంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. సయోధ్యలో భాగంగానే మేం హస్తినకు వచ్చి.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు అనుమతివ్వాలని మోదీకి విజ్ఞప్తి చేశాం. చట్టాలను సవరించి.. 42% రిజర్వేషన్ల అమలుకు అనుమతించకపోతే మీరు గద్దె దిగాల్సిందే.. గ్రామాల్లో మీ గద్దెలు కూలాల్సిందే. మమ్మల్ని తక్కువ అంచనా వేస్తే ఎర్రకోటపై జెండా ఎగరేస్తాం. మా రిజర్వేషన్లు మేం సాధిస్తాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ చేసిన తీర్మానానికి అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుకోవడానికి అనుమతివ్వాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పలు బీసీ సంఘాలు దిల్లీలోని జంతర్‌మంతర్‌లో బుధవారం మహాధర్నా నిర్వహించాయి. దీనికి సీఎం హాజరై మాట్లాడారు. "బీసీలకు 42% రిజర్వేషన్లపై శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానించి పంపినా.. అనుమతివ్వడానికి ప్రధానికొచ్చిన కష్టమేంది? బిల్లుకు అనుకూలమని జంతర్‌మంతర్ వేదికగా 16 పార్టీలు ప్రకటించాయి. తాను బీసీల కోసమే ఉన్నానని ప్రధాని మోదీ అంటున్నారు. బీసీల కోసం ప్రాణాలిస్తామని బండి సంజయ్ ప్రకటిస్తున్నారు. మేం మీ ప్రాణాలు కాదు.. 42% రిజర్వేషన్లు మాత్రమే కోరుతున్నాం. దీనికి అనుమతివ్వకపోతే.. దేశమంతా జాగృతం చేసి అన్ని సంఘాలను కూడగడతాం. నిప్పురవ్వలా రగిలి దేశమంతటా కార్చిచ్చులా వ్యాపిస్తుంది. మీరు దిల్లీ గద్దెపై ఎలా ఉంటారో చూస్తాం. మా డిమాండ్లకు మోదీ దిగైనా రావాలి... లేదంటే గద్దె దిగైనా పోవాలి.

2015లో ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ జంతర్‌మంతర్‌లో ధర్నా చేసి అలసిపోయి చెట్టు కింద కూర్చున్నప్పుడు 'మీది ధర్మమైన కోరిక కాబట్టి ధర్మయుద్ధం ప్రకటించాల'ని నేను చెప్పడంతో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో లక్షల మంది సమక్షంలో ధర్మయుద్ధం ప్రకటించి విజయం సాధించి లక్ష్యం చేరుకున్నారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే పరేడ్ గ్రౌండ్‌లో పది లక్షల మందితో ధర్మయుద్ధం ప్రకటించి మన బలమేంటో చూపిద్దాం"

## మెట్రో ప్రయాణికులకు గుడ్‌న్యూస్



### సమయాన్ని పొడిగించిన యాజమాన్యం

హైదరాబాద్: హైదరాబాద్ నగరవాసులకు మెట్రో సేవలు ఎంతో కీలకంగా మారాయి. ఎందుకంటే నగరంలో ఏ ప్రదేశానికి వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య వల్ల చాలా సమయం పడుతుంది. అదే మెట్రోలో వెళితే.. నిమిషాల్లో వెళ్లవచ్చు. అందుకే చాలామంది మెట్రోలోనే ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో మెట్రో సేవల సమయాన్ని పొడిగించాలని ఎప్పటి నుంచే డిమాండ్ చేస్తున్నారు. మన భాగ్యనగరంలో తక్కువ కాలంలోనే పాపులర్‌గా మారిన మెట్రో రైలు సర్వీసులు విషయంలోనూ అనేక మంది ప్రయాణికులు రాత్రి 12 గంటల వరకు సేవలు సేవలు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు. ఎట్టకేలకు అది నెరవేరింది. ప్యాసింజర్లకు అదిరిపోయే గుడ్‌న్యూస్ చెప్పింది హైదరాబాద్ మెట్రో. మెట్రో రైల్ సమయం పొడిగించారు. పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్యను దృష్టిలో పెట్టుకొని మెట్రో రైల్ సమయాన్ని పొడిగించారు హైదరాబాద్ మెట్రో అధికారులు. మారిన టైమింగ్స్ ప్రకారం.. ఇక మీదట సోమవారం నుంచి శుక్రవారం వరకు.. ఆయా టెర్మినల్ స్టేషన్స్ నుంచి ఉదయం 6 గంటలకు మొదటి మెట్రో రైలు ప్రారంభం అవుతుంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటల 45 నిమిషాల దాకా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. శనివారం నాడు ఆయా టెర్మినల్ మెట్రో స్టేషన్ నుంచి ఉదయం 6 గంటలకు తొలి మెట్రో స్టార్ట్ అవుతుంది. రాత్రి 11 గంటల వరకు రైళ్ల సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక నుంచి ఆదివారం నాడు ఉదయం 7 గంటలకు ఆయా టెర్మినల్ స్టేషన్ నుంచి ఫస్ట్ మెట్రో రైలు మొదలవుతుంది. సండే కూడా రాత్రి 11 గంటల వరకే రైళ్ల రాకపోకలు ఉంటాయి.



## నియోజకవర్గానికి లక్షమంది తరలింపు

రజతోత్సవాలపై నియోజకవర్గాల వారీగా సమావేశాలు

మెదక్, నిజామాబాద్ నేతలకు కెసిఆర్ సూచన

గజ్వేల్: భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవ మహాసభ సందర్భంగా నియోజక వర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించాలని నేతలకు పార్టీ అధినేత కెసిఆర్ సూచించారు. సభఏర్పాట్లపై ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎర్రవెల్లిలోని నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలు సమావేశానికి హాజరయ్యారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్లపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశంచేశారు. నియోజకవర్గానికి లక్ష మందికి తగ్గకుండా సభకు తరలించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. మహాసభ ప్రజలకు మనోధైర్యం వచ్చేలా ఉండాలని.. మహాసభకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు- చూసుకోవాలని నేతలకు సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ-ఆర్,


మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కే ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

## పలు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం : వాతావరణశాఖ



హైదరాబాద్: మధ్య మహారాష్ట్ర దాని పరిసర ప్రాంతాలలో సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర దాని సమీప ప్రాంతాల్లో ఉన్న ఉపరితల ఆవర్తనం నుంచి కర్ణాటక, తమిళనాడు మీదుగా కొమరీన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9 ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. ఇవాళ(బుధవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు, వడగండ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని ఆదిలాబాద్, కొమరం భీమ్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి జిల్లాలలో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మోస్తరు వర్షాలు కురవనుండగా.. వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్ నగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాల పల్లి, ములుగు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు వాతావరణ శాఖ అధికారులు. ఆవర్తనం, ద్రోణి ప్రభావం ఉన్నప్పటికీ తెలంగాణలోని కొన్ని జిల్లాలలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

# లోక్‌సభలో వక్ఫ్ చట్ట చట్టసవరణ




న్యూఢిల్లీ: వక్ఫ్ చట్టంపై వాడీవేడీ చర్చ జరిగింది. లోక్‌సభలో బిల్లుపై పలువురు ఎంపిలు తమ అభిప్రాయాలను తెలియచేశారు. వక్ఫ్ చట్ట సవరణ జరగకుంటే...పార్లమెంట్ భవనం కూడా దాని కిందకు వచ్చేదని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభ ముందుకు వక్ఫ్ సవరణ బిల్లును తీసుకు వచ్చింది. ఈ బిల్లును సభలో కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. యూపీఏ హయాంలో ఈ వక్ఫ్ చట్టంలో కీలక మార్పులు చోటు చేసుకున్నాయని ఆయన ఆరోపించారు. 1970 నుండి ఢిల్లీలో జరుగుతున్న ఒక కేసులో పార్లమెంట్ భవనంతో సహా అనేక ఆస్తులు ఉన్నాయన్నారు. ఢిల్లీ వక్ఫ్ బోర్డు వీటిని క్లెయిమ్ చేసింది.. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ఉందని గుర్తు చేశారు. కానీ అప్పుడు యుపిఎ 123 ఆస్తులను డీనోటిఫై చేసి వక్ఫ్ బోర్డుకు ఇచ్చిందని కేంద్ర మంత్రి రిజిజు పేర్కొన్నారు. అయితే ఈ వక్ఫ్ సవరణ బిల్లు ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టకుంటే.. పార్లమెంట్ భూమి సైతం వక్ఫ్ ఆస్తి అనే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం వక్ఫ్ చట్టంలోని పలు క్రూరంగా పరిగణించే అంశాలను తమ ప్రభుత్వం తొలగించిందన్నారు. అంతేకాకుండా.. దక్షిణ భారతంలోని పలు రాష్ట్రాలు తమిళనాడు, కర్ణాటకలోని పలు దేవాలయాలతోపాటు హర్యానాలోని వివిధ గురుద్వార్‌లను ముస్లిం సమాజం వక్ఫ్ భూమిగా క్లయిమ్ చేసిందని రిజిజు ఈ సందర్భంగా వివరించారు. అయితే తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయకూడదంటూ.. ప్రతిపక్షాలకు కేంద్ర మంత్రి రిజిజు చురకలంటించారు. ఈ అంశాన్ని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు నడుం బిగించాయని మండిపడ్డారు. ఈ బిల్లుపై అన్ని వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ బిల్లును తీసుకురాకపోతే.. పార్లమెంట్ భూమిని కూడా వక్ఫ్ ఆస్తిగా చెబుతారని అన్నారు. బిల్లు గురించి విపక్షాలు అసత్య ప్రచారం చేశాయి. అందులోని అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. 1954లో తొలిసారి వక్ఫ్ చట్టం అమల్లోకి వచ్చింది. అది అప్రజాస్వామికం అని ఆనాడు ఎవరూ చెప్పలేదు. పార్లమెంట్ ఉభయ సభ్యులతో కూడిన జేపీసీకి అభినందనలు. మొత్తం 284 ప్రతినిధులు, 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వక్ఫ్ బోర్డులు జేపీసీలో తమ వాదనలు వినిపించాయి. మేం బిల్లులో కొన్ని సానుకూల మార్పులు చేస్తే.. మమ్మల్ని ఎందుకు ప్రశ్నిస్తున్నారు. ఈ బిల్లు తీసుకుని రాకపోతే.. కొందరు పార్లమెంట్ భవనాన్ని కూడా వక్ఫ్ ఆస్తిగా పేర్కొంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ స్పందనకు గతంలో ఏఐయూడీఎఫ్ చీఫ్ బద్రుద్దీన్ అజ్మల్ చేసిన వ్యాఖ్యలు కారణం. దేశ రాజధానిలోని పార్లమెంట్ భవనం, దాని పరిసర ప్రాంతాలు వక్ఫ్ ఆస్తికి సంబంధించినవని అజ్మల్ అప్పట్లో వాదించారు. వక్ఫ్ బిల్లు ముస్లిం సమాజానికి చెందిన మత విశ్వాసాలకు ఎలాంటి ఆటంకం కలిగించదు. ఇది కేవలం ఆస్తుల నిర్వహణకు సంబంధించిన విషయం మాత్రమే. ఈ బిల్లుకు మద్దతిచ్చేవారు, వ్యతిరేకించే వారు ఎప్పటికీ గుర్తుండిపోతారు. పేద ముస్లింలకు వక్ఫ్ ఆస్తులను ఉపయోగించాలి. వారిని అలా వదిలేయకూడదు. వారి ఉన్నతి కోసం మోదీ ప్రభుత్వం ఏవైనా చర్యలు తీసుకుంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. ముస్లిం ప్రతినిధులు ఆ బిల్లును ఆహ్వానించారు. వీలైనంత త్వరగా దీనికి ఆమోదం లభించాలని ఆ వర్గంలోని పేదలు కోరుకుంటున్నారు. అలాగే రిజిస్టర్ చేసిన ఆస్తి విషయంలో ఎవరూ జోక్యం చేసుకోరు. ప్రభుత్వం తీసుకువచ్చిన సంస్కరణలతో ముస్లిం మహిళలు, పిల్లలకు వారి హక్కులు దక్కుతాయి. ప్రభుత్వ భూమి విషయంలో వివాదం తలెత్తితే కలెక్టర్ కంటే పైస్థాయి వ్యక్తి తీర్పు ఇవ్వాలంటూ జేపీసీ చేసిన ప్రతిపాదనను మేం అంగీకరించాం అని రిజిజు స్పష్టత ఇచ్చారు. మరోవైపు విపక్షాలు దీనిని వ్యతిరేకిస్తున్నాయి.

ఈ బిల్లుకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మార్చ్ జరిగింది. ఇక ఈ వక్ఫ్ బోర్డు విషయంతో తాము క్లియర్‌గా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఆ క్రమంలో కేంద్ర, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్‌లలో ఇద్దరు ముస్లిమేతర వ్యక్తులు ఉండాలని నిర్ణయించామన్నారు. అలాగే ఈ వక్ఫ్ బోర్డులల్లో ముస్లిం మహిళలకు చోటు- ఉండడం లేదని తెలిపారు. దీంతో ఈ బోర్డుల్లో ఇద్దరు ముస్లిం మహిళలకు స్థానం కల్పిస్తామన్నారు. మరోవైపు బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాదిలో జరగనున్నాయని.. ఆ రాష్ట్రంలో 17 శాతం మైనార్టీల ఓట్లు- ఉన్నాయి. అందుకోసమే ఈ బిల్లును తీసుకు వస్తున్నారంటూ ప్రతిపక్షాలు ఆరోపణ చేస్తున్నాయి.

# ఉద్రిక్తంగా హెచ్‌సీయూ ప్రాంతాలు

## విద్యార్థులను చితకబాదిన పోలీసులు

హైదరాబాద్: హెచ్‌సీయూ భూములను కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి సర్కార్‌పై హెచ్‌సీయూ విద్యార్థులు పోరుబాట కొనసాగిస్తూనే ఉన్నారు. జీవ వైవిధ్యాన్ని కాపాడాలంటూ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక బుధవారం ఉదయమే హెచ్‌సీయూ క్యాంపస్‌ను వేలాది మంది పోలీసులు చుట్టుముట్టారు. క్యాంపస్ చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యూనివర్సిటీ లోపలికి బయటి వ్యక్తులను రానివ్వకుండా, విద్యార్థులను బయటకు రానివ్వకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బుధవారం ఉదయం హెచ్‌సీయూ క్యాంపస్‌లో ప్రొఫెసర్లు, విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ క్రమంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రొఫెసర్లు, విద్యార్థులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దొరికిన విద్యార్థులను దొరికినట్లు లాఠీలతో చితకబాదారు. పోలీసుల తీరుపై ప్రొఫెసర్లు విద్యార్థులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినదిస్తూ, పోలీస్ జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

## ముగిసిన పదో తరగతి పరీక్షలు



**హైదరాబాద్:** విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు బుధవారంతో ముగిశాయి. టెన్త్ పరీక్షల కోసం 5,09,403 మంది రిజిస్టర్ చేసుకోగా.. మొత్తం 2,650 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు న్విహించిన ఈ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. నేడు సోషల్ స్టడీస్ పరీక్షతో పది పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సందడి చేశారు. కాగా, పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాలు ఈ నెల చివరివారంలో విడుదలకానున్నాయి. ఓరియంటల్ సైన్స్‌కు సంబంధించిన రెండు పరీక్షలు

ఈ నెల 3, 4 తేదీల్లో జరుగుతాయి.

వాటికి కొద్ది మంది మాత్రమే హాజరవుతారని అధికారులు తెలిపారు.

# అమీన్‌పూర్ పిల్లల మృతి కేసును ఛేదించిన పోలీసులు




**వివాహేతర మోజులో పడి పిల్లలు, భర్తను చంపాలని కుట్ర పెరుగు అన్నం తినకపోవడంతో బయటపడ్డ భర్త విచారణలో విస్తుపోయే నిజాలు**

హైదరాబాద్ వివాహేతర సంబంధాల కోసమే ఎంతకైనా తెగిస్తున్నారు. కట్టుకున్న భర్త, కన్న పిల్లలను సైతం చంపటానికి వెనుకాడటం లేదు. ఈ నేపథ్యంలోనే అమీన్‌పూర్ పిల్లల మృతి కేసును పోలీసులు చేధించారు. ముగ్గురు పిల్లల మృతి కేసులో తల్లే విలన్ అని గుర్తించారు. విషం పెట్టి కడుపున పుట్టిన ముగ్గురు పిల్లలను తల్లే పాశవికంగా అంతమొందించినట్లు తేల్చారు. వివాహేతర సంబంధం మోజులో ముగ్గురు పిల్లలను హత్య చేసిందని నిర్ధారించారు. గత నెల 27న పిల్లలకు పెరుగన్నంలో విషం పెట్టిందని.. తాను కూడా భోజనం చేసి అస్వస్థతకు గురైనట్టు నాటకం ఆడిందని పోలీసులు తేల్చారు. విచారణలో నిజం బయటపడటంతో తల్లి రజితను అరెస్ట్ చేశారు. భర్తను కూడా చంపాలని ఆమె డిసైడయ్యింది. అయితే అతను పెరుగన్నం తినకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. హైదరాబాద్ శివారు అమీన్‌పూర్‌లో జరిగిన ఈ ఘటన చాలా సంచలనం సృష్టించింది. ముందుగా భర్తను అనుమానించారు పోలీసులు. లోతైన దర్యాప్తు తర్వాత భార్య రజిత బాగోతం బయటపడింది. కొన్నాళ్ల క్రితం రజిత టెన్త్ క్లాస్‌మేట్స్ గెట్ టుగెదర్‌కు వెళ్లింది. అక్కడ ఓ స్నేహితుడితో పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ సంబంధానికి పిల్లలు అడ్డొస్తున్నారనే కారణంతో వాళ్లను చంపాలని ప్లాన్ చేసింది. గత నెల 27న శుక్రవారం రాత్రి పిల్లలకు పెరుగన్నంలో విషం పెట్టి తినిపించింది. భర్త చెన్నయ్య ఆరోజు పెరుగు తినకుండా భోజనం ముగించాడు. తర్వాత వాటర్ ట్యాంకర్ డ్రైవింగ్ పనిపై బయటకు వెళ్లిపోయాడు. తిరిగొచ్చాక చూస్తే పిల్లలు విగతజీవులుగా పడి ఉన్నారు. ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోయారు. 12 ఏళ్ల సాయికృష్ణ, 10 ఏళ్ల మధు ప్రియ, 8 ఏళ్ల గౌతమ్ మృతితో తీవ్ర విషాదం నెలకొంది. ఎందుకిలా జరిగిందో తనకు తెలియదని, తాను కూడా తీవ్ర అస్వస్థతకు గురయ్యానని రజిత చెప్పడంతో ఆమెను ఆస్పత్రిలో చేర్పించాడు భర్త. చివరికి విచారణలో ప్రియుడితో కలిసి రజిత చేసిన ఘోరం బయటపడింది. రజితతోపాటు ఆమె ప్రియుడూ ఇప్పుడు పోలీసుల అదుపులో ఉన్నారు. వివాహేతర సంబంధం మోజులో పడి కడుపున పుట్టిన బిడ్డలను చంపుకోవటంపై స్థానికులు మండిపడుతున్నారు.

## తెలంగాణలో ఎల్ఆర్ఎస్ గడువు పెంపు

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును ఈ మాసాంతానికి అంటే.. ఏప్రిల్ 30వ తేదీ వరకు పెంచుతూ ప్రభుత్వం బుధవారం ఆదేశించింది. ఈ గడువు మార్చి 31వ తేదీతో పూర్తయింది. కానీ ఈ గడువును పెంచుతూ పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇక ఏప్రిల్ 30వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్‌కు 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. మరోవైపు ఈ ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ద్వారా ఇప్పటికే లే అవుట్లను క్రమబద్ధీకరణ చేసింది. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి సుమారుగా రూ. 1000 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు సమాచారం. అలాగే ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాలిటీ-ల పరిధిలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 15.27 లక్షలు వచ్చాయి. వాటిలో 15,894 దరఖాస్తులను ప్రభుత్వాధి కారులు తిరస్కరించారు. ఇక ప్రాసెస్ అయిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 6. 87లక్షలు కాగా.. ఎల్ఆర్ఎస్ ఫీజు రూ. 8.65 లక్షలు పెండింగ్‌లో ఉంది. వీటితో పాటు- ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన దరఖాస్తులు 2.6 లక్షలు కాగా.. వాటికి సంబంధించి ప్రొసీడింగ్ ఇచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు 58, 032 ఉన్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక ఈ ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపు గడువును పెంచడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే.. ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ వివరాలను వెబ్‌సైట్ పోర్టల్‌లో పొందు పరిచింది. అయితే అందులోని ప్రభుత్వ ధరలకు.. బయట మార్కెట్ విలువకు పూర్తి వాస్తవ విరుద్ధంగా ఉంది. అలాగే ఎల్ఆర్ఎస్ కోసం ప్రభుత్వం ఫోన్ నెంబర్‌ను ప్రజలకు అందుబాటు-లోకి తీసుకు వచ్చింది. ఆ నెంబర్

సైతం సక్రమంగా పని చేయడం లేదంటూ ప్రజల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి.

అలాగే వెబ్ సైట్ పోర్టల్‌లోని అంశాలపై ప్రభుత్వం దృష్టికి ప్రజలు తీసుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. అదీకాక ఎల్ఆర్ఎస్ గడవు సమీపిస్తున్నా.. ప్రభుత్వం ఎటు-వంటి చర్యలు తీసుకోలేదంటూ పలువురు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. అలాంటి వేళ.. ఎల్ఆర్ఎస్ ఫీజు గడువును మరో నెల రోజులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసింది.

## ఆడుదాం ఆంధ్రాలో ఎక్కడా అవినీతి లేదు

**అమరావతి:** ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తారన్న భయంతో కేసులు పెడుతున్నారని వైసిపి నేత మాజీ మంత్రి ఆర్కే రోజా విమర్శించారు. తప్పు చేసినట్లు ఆధారాలు ఉంటే కేసులు పెట్టండి. మీరు ఎన్ని కేసులు పెట్టినా మేము సిద్ధంగా ఉన్నాం అని సవాల్ చేశారు.. ఆడుదాం ఆంధ్రాలో అవినీతి జరగలేదు. నిబంధనల ప్రకారం ఆడుదాం ఆంధ్రా నిర్వహించాం.. శాప్ చైర్మన్ కు, స్పోర్ట్స్ మినిస్టర్ కు ఏమి సంబంధం లేదని స్పష్టం చేవారు. అసెంబ్లీలో, మండలిలో ఆడుదాం ఆంధ్రాలో ఏ అవినీతి జరగలేదని నివేదిక ఇచ్చారు. రోజాను, కొడాలి నాని, అంబటి రాంబాబు, పేర్ని నానినీ అరెస్టు చేసి సంబరాలు చేసుకోవాలని చూస్తున్నారు.. మేం భయపడబోం అని అన్నారు..ఈ మేరకు ఏపీ సీఎం

చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై రోజా.. ఘాటు వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, లోకేష్ కుటుంబాలను బంగారుమయం చేసుకుంటారేమో.. కానీ, పేద ప్రజలకు చేసేదేమీ లేదన్నారు.. చంద్రబాబు మీటింగులకు వచ్చిన జనం మధ్యలోనే వెళ్లిపోతున్నారు.. ఇక, పవన్ కల్యాణ్ ఎక్కడ నిద్రపోతున్నారో అర్థం కావటం లేదని ఎద్దేవా చేశారు. మొన్న వీళ్ల వెకిలి డ్యాన్సులకు పడిపడి నవ్వారు.. తిరుమలలో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నా ఈ సనాతన యోధుడు ప్రశ్నించటం లేదు.. తిరుమలలో జరిగిన అన్యాయాలు ప్రశ్నించే బాధ్యత మీకు లేదా..? వక్ఫ్ బిల్లుపై వీరు చేస్తున్న వ్యవహారాన్ని రాష్ట్రంలో ఉన్న ముస్లీంలు మొత్తం చూస్తున్నారు.. అసలు, బీజేపీకి భయపడి పవన్ కల్యాణ్ ఎక్కడా ఇఫ్తార్ లో కూడా పాల్గొనలేదన్నారు.. వైసీపీలో గట్టిగా మాట్లాడే వారిని టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వం.. ప్రశ్నించే గొంతులను అక్రమ కేసులతో భయపెట్టాలని చేస్తున్నారు.. రాబోయే రోజుల్లో వాళ్ళ నేతలు కూడా చూస్తారని హెచ్చరించారు.. ఇంతవరకు ఆడుదాం ఆంధ్రపై కేసులు బుక్ అవ్వలేదు.. అసెంబ్లీలో ఇప్పటికే అన్నీ విషయాలు స్పష్టంగా చెప్పాం.. ఈ వ్యవహారంలో నాకు, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఏం సంబంధం లేదన్నారు. లోపల ఒక మాట, బయట ఒక మాట మాట్లాడుతున్నారు.. అంతా పారదర్శకంగా జరిగింది.. రోజాని అరెస్ట్ చేసి సంబరాలు చేసుకోవాలనే ఆశ ఉంది.. కొడాలి నాని, పేర్ని నాని, అంబటి రాంబాబును అరెస్ట్ చేయించాలనే ఆలోచన తప్ప మరొకటి లేదన్నారు. మాజీ మంత్రుల అరెస్టులు, వరుసగా నమోదవుతున్న కేసులపై స్పందించిన రోజా.. వైసీపీలో బలమైన నాయకత్వాన్ని తొక్కడానికి వాళ్ల నోట్లు నొక్కడానికి కేసులు పెడుతున్నారని రోజా మండిపడ్డారు.

## విశాఖలో ప్రేమోన్మాది దాడిలో తల్లి మృతి




విశాఖపట్టణం: మధురవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. స్వయంకృషి నగర్‌లో ఓ అమ్మాయి, ఆమె తల్లిపై ప్రేమోన్మాది దాడి చేశాడు. ఈ ఘటనలో తల్లి మృతి చెందగా.. కుమార్తెకు తీవ్రగాయాలయ్యాయి. ప్రేమను నిరాకరించిందనే కోపంతో మధురవాడ స్వయంకృషి నగర్‌లో బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో యువతితో పాటు, ఆమె తల్లిపై ఓ వ్యక్తి కత్తితో అతి కిరాతకంగా దాడి చేసి పరారయ్యాడు. ఈ ఘటనలో తల్లి లక్ష్మి మృతిచెందారు. యువతి దివ్యకు తీవ్ర

గాయాలయ్యాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన యువకుడు నవీన్‌గా తెలుస్తోంది. బాధితురాలు డిగ్రీ చదువుకొని ఇంటి దగ్గర ఖాళీగా ఉందని సమాచారం. విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రేమ పేరుతో యువతిని నవీన్ అనే వ్యక్తి కొంత కాలంగా వేధింపులకు గురిచేశాడు. అయితే ప్రేమను నిరాకరించడంతో ఆమెను హత్య చేయాలని నిర్ణయించాడు. వెంటనే యువతి ఇంటికి వెళ్లిన యువకుడు కత్తితో యువతితో పాటు ఆమె తల్లిపైనా దాడికి తెగబడ్డాడు. తీవ్రంగా గాయపడిన తల్లి లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా.. యువతి తీవ్రంగా గాయపడింది. ప్రస్తుతం యువతి.. గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. 48 గంటలు గడిస్తే గాని ఆమె పరిస్థితి ఎలా ఉంది అనేది చెప్పలేమని వైద్యులు చెప్పారు. అయితే ఈ ఘటనలో యువతి కూడా మరణించినట్లు వార్తలు రావడంతో దీనిపై ఏసీపీ అప్పలరాజు మాట్లాడుతూ.. యువతికి చికిత్స జరుగుతోందని చెప్పారు. అలాగే విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనాస్థలికి వెళ్లగా.. అప్పటికే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, డీసీపీ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తల్లీకూతుళ్లపై ప్రేమోన్మాది దాడితో స్వయంకృషి నగర్‌లో ఒక్కసారిగా అలజడి నెలకొంది. మరోవైపు మధురవాడ ప్రేమోన్మాది ఘటనపై హోంమంత్రి వంగలపూడి అనిత స్పందించారు. విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీతో ఫోన్‌లో మాట్లాడారు. బాధితురాలు దివ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. దివ్యకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రేమోన్మాదిని త్వరగా గాలించి పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. దివ్య తల్లి లక్ష్మి మృతిపై హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దర్యాప్తులో భాగంగా బృందాలుగా ఏర్పడిన పోలీసులు నవీన్ కోసం గాలింపు చేపట్టారు. నిందితుడిని శ్రీకాకుళం సమీపంలో అదుపులోకి తీసుకొని విశాఖ తరలిస్తున్నట్టు సీపీ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. ప్రేమోన్మాది ఘాతుకంపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత యువతికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# కొండపల్లి గాయత్రిని సన్మానించిన కలెక్టర్.

**గ్రూప్ వన్ ఉద్యోగానికి ఎంపికైన గాయత్రి.**

**జిల్లా బీసీ సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ గా నియామకం.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 2:**



టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్ వన్ తుది ఫలితాల్లో విజేతగా నిలిచి, జిల్లా అధికారి ఉద్యోగానికి ఎంపికయిన జిల్లా బీసీ సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ కుమారి కొండపల్లి గాయత్రిని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు చందర్ నాయక్, విక్టర్ బుధవారం సన్మానించారు. గ్రూప్ వన్ ఉద్యోగానికి ఎంపికైన గాయత్రి, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్, అదనపు కలెక్టర్లు ఆమెను ప్రశంసించి, భవిష్యత్తులో నిర్వహించబోయే బాధ్యతలపై దిశా నిర్దేశం చేశారు. చిన్న వయస్సులో జిల్లా అధికారిగా ఎంపిక కావడం, భవిష్యత్తులో కన్ఫర్మ్ ఐఏఎస్ కానుండటం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న గాయత్రికి, గురువులా అండగా నిలిచి, మార్గ నిర్దేశం చేసి, విజయం సాధించేలా చేసిన తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగి రేవంత్ ను సైతం జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. జర్నలిస్టుల రక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బొబ్బిలి నర్సయ్య, బిజెపి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంకర్ లక్ష్మీనారాయణ, తెలంగాణ ఎంప్లాయీస్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు ఆమెను సన్మానించి, అభినందించారు. గాయత్రి విజయంలో అండగా నిలిచిన రేవంత్ కృషిని కొనియాడారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఉద్యోగులు సైతం గాయత్రికి సన్మానం చేశారు.

# ఎల్.ఆర్.ఎస్ గడువు పొడిగింపు.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 02**

**ఏప్రిల్ 30 వరకు చెల్లింపులకు అవకాశం.**

**సద్వినియోగం చేసుకోవాలని కోరిన కలెక్టర్.**

అనధికార లే ఔట్ల క్రమబద్ధీకరణ, ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ఎల్.ఆర్.ఎస్ 25 శాతం రాయితీ సదుపాయాన్ని పొడిగించిందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. మార్చి 31 నాటితో ఈ గడువు ముగియగా, ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ప్రభుత్వం ఎల్.ఆర్.ఎస్ గడువును ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడిగించిందని అన్నారు. జిల్లాలోని అర్హులైన వారందరూ ఈ వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఎఫ్.టి.ఎల్, నిషేధించిన సర్వే నెంబర్లు మినహా ఎల్.ఆర్.ఎస్ కు దరఖాస్తు చేసుకున్న అందరికీ రెగ్యులరైజేషన్ రుసుము నిర్ణయించడం జరిగిందని తెలిపారు. రుసుము ఎంత అనేది ఎవరైనా తమ సెల్ నెంబర్ ద్వారా లాగిన్ అయ్యి పరిశీలించుకోవచ్చని సూచించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న ఎల్.ఆర్.ఎస్ దరఖాస్తుదారులు ఏప్రిల్ 30వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే 25 శాతం రిబేటు వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో అనేక మంది తమ ప్లాట్లను, అనధికార లే ఔట్లను రాయితీతో కూడిన రుసుము చెల్లించి రెగ్యులరైజ్ చేసుకున్నారని కలెక్టర్ వెల్లడించారు. వివిధ కారణాల వల్ల రెగ్యులరైజేషన్ చేసుకోలేకపోయిన వారి కోసం మరో అవకాశం కల్పిస్తూ రాయితీ సదుపాయం గడువును ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించిందని అన్నారు. అనధికారికంగా లేఅవుట్లు చేసి, అందులో 10 శాతం ప్లాట్లను విక్రయించిన వారికి మిగతా ప్లాట్లను క్రమబద్ధీకరించుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ సూచించారు. క్రమబద్ధీకరించని భూములలో ఎటువంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతి మంజూరు చేయడం జరగదని, దీనిని దృష్టిలో పెట్టుకొని అర్హులైన వారందరు ఈ నెల 30వ తేదీ లోపు క్రమబద్ధీకరణ చేసుకోవాలని, ప్రభుత్వం పొడిగించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

# రాష్ట్రంలో నంబర్ వన్.. కామారెడ్డి ఆర్టీఓ.

**సంబరాలు జరుపుకున్న సిబ్బంది.**

**కమర్షియల్ వాహనదారులు క్రమం తప్పకుండా ట్యాక్స్ లు చెల్లించాలి.**

**రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, ఏప్రిల్ 2:**



వివిధ పన్నుల వసూళ్ళలో ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ కు 92.4 శాతం పూర్తిచేసి రాష్ట్రంలోనే మొదటి స్థానాన్ని కామారెడ్డి జిల్లా రోడ్డు రవాణా శాఖ కార్యాలయం దక్కించుకుందని ఆర్టీఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివిధ పన్నుల రూపంలో గత 2023 %-% 2024 సంవత్సరం లో 63 కోట్లు వసూలు చేయగా దానికి 16 శాతం జోడించి ప్రభుత్వం ఈ సంవత్సరం 73 కోట్ల టార్గెట్ ను విధించిందని, అందులో 24 %-% 25 సంవత్సరానికి గాను 68 కోట్ల 19 లక్షల రూపాయల పన్నులు వసూలు చేసినట్లు ఆయన తెలిపారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం 5.03 శాతం ఎక్కువగా పన్నులు వసూలు చేశామన్నారు. ఈ సంవత్సరంలో వసూలు చేసిన వివరాలను ఆయన వివరిస్తూ క్వాటర్ టెక్స్ లో 9 కోట్ల 88 లక్షల 55,000 వసూలు చేశామని, లైఫ్ టాక్స్ లో 38 కోట్ల 34 లక్షల 34 వేల రూపాయలను వసూలు చేయడం జరిగిందన్నారు. ఫీజుల రూపంలో ఏడు కోట్ల 35 లక్షల 47,000, సర్వీస్ చార్జీల రూపంలో రెండు కోట్ల పదారు లక్షల89,000, గ్రీన్ టాక్స్ రూపంలో 79 లక్షల 83000, ఇన్ఫోసిమెంట్ ఆధ్వర్యంలో 9 కోట్ల 63 లక్షల 91 వేల రూపాయలను వసూలు చేయడం జరిగిందన్నారు. వీటన్నిటికీ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీల సహకారంతో తాము పన్నులను వసూలు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ పన్నుల వసుఊళ్ళలో ప్రజాప్రతినిధుల సహకారం సైతం ఉందన్నారు. కమర్షియల్ వాహనాదారులు మూడు నెలలకు ఓసారి చెల్లించే టాక్స్ క్రమం తప్పకుండా చెల్లించేందుకు ప్రజాప్రతినిధుల పాత్ర చాలా ఉందన్నారు. కమర్షియల్ వాహనదారులు తమ వాహనాలను వాడనట్లయితే ఆ సమాచారాన్ని వెంటనే ఆర్టీవో కార్యాలయంలో అందజేయాలని, తద్వారా ఆ వాహనానికి ఆ మూడు నెలల పన్ను మినహాయింపు ఇవ్వడం జరుగుతుంద న్నారు. త్వరలోనే హెల్మెట్ లేని వాహనదారులకు 5000 రూపాయల జరిమానా విధించడం జరుగుతుందని తద్వారా రోడ్డు ప్రమాదాలలో మరణాలను తగ్గించేందుకే తమ ప్రయత్నమని ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. హెల్మెట్ లేకపోతే బండి సీజ్ చేయడం లేదా 5 వేల రూపాయల జరమానా విధించడం జరుగుతుందన్నారు.

# సర్వాయి పాపన్నగౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకు.

**- బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, ఏప్రిల్ 02**



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తి అందరికీ అనుసరణీయమని వక్తలు పేర్కొన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వినాయకనగర్ లో గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ అంకిత్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను అధికారికంగా జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ కనబర్చిన పోరాట తెగువ అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆనాటి రాచరిక వ్యవస్థలోని దౌర్జన్యాలను ఎండగడుతూ, సర్వాయి పాపన్న గౌడ్ వేలాది మందితో సైన్యాన్ని సమీకరించుకుని పన్నులు లేని వ్యవస్థను నెలకొల్పి గొప్ప పరిపాలనను అందించారని కొనియాడారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. గీత కార్మికులు ఐకమత్యంగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి స్రవంతి, సహాయ అధికారి నర్సయ్య, సి.గంగాధర్, గౌడ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారయ్య గౌడ్, పట్టణ గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.సత్యనారాయణ గౌడ్, నాయకులు చెరకు లక్ష్మణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ రత్నాకర్ గౌడ్, తాళ్లపల్లి రాజా గౌడ్, సేపూరి సుమన్ గౌడ్, నాగరాజు గౌడ్, బండి సాయా గౌడ్, మాజీ కార్పొరేటర్ ఉమా శ్రీనివాస్ గౌడ్, అధిక సంఖ్యలో గీత వృత్తిదారులు పాల్గొన్నారు.

# ఆటిజం పిల్లల పెంపకంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

**మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవితేజ.**

**స్నేహ సొసైటీ లో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 2:**




ఆటిజం పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవితేజ అన్నారు.బుధవారం స్థానిక మారుతి నగర్ లోని స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీ కన్స్ట్రక్షన్ వారి మానసిక దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవాని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ రవితేజ పాల్గొని ప్రసంగించారు. ఆర్టిజం అనేది ప్రతి 4,000 మంది పిల్లల్లో ఒకరికి వస్తుందని దీనిపై ఎన్నో అధ్యయనాలు జరిగినప్పటికీ ఆర్టిజం పిల్లలు ఏ కారణం వల్ల పుడతారో ఏ కారణాల వల్ల పుడతారో తెలవలేదని చాలామంది చాలా విధాలుగా అపోహలు పడతారని అన్నారు. ప్రధానంగా ఆటిజం పిల్లలు అధికంగా ఫోన్ వాడడం వల్ల, జన్యుపరమైన లోపాల వల్ల తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు వచ్చే జాండీస్ వల్ల, పౌష్టికాహార లోపం వల్ల ఆటిజం పిల్లలు పుడతారని ప్రజలు అపోహబడుతారు కానీ వీరు ఏ కారణాల వల్ల పుడతారు అనేది ఇంతవరకు ఏ అధ్యయనం నిరూపించలేదు. ఆటిజం పిల్లల్లో కొంతమందికి నార్మల్ ఆక్టివ్ ఉంటుందని కానీ వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలి తల్లిదండ్రులకు అవగాహన లేదని చాలా చాలామంది ప్రముఖ వ్యక్తులను చూసినట్లయితే ఆల్బర్ట్ ఐన్స్టీన్, స్టీవ్ జాబ్స్, ఎలాన్ మాస్క్, అబ్రహం లింకన్ లాంటి ప్రముఖ వ్యక్తులు ఆర్టిజం పారిన పడినప్పటికీ ఉన్నత శిఖరాలను చేరుకోగలిగారని కానీ ఇలాంటి పిల్లలకు ఎలాంటి శిక్షణ ఇచ్చినట్లయితే అభివృద్ధి చెందుతారో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని డాక్టర్ రవితేజ తెలిపారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా వచ్చిన డాక్టర్ వికాస్ మానసిక వైద్య నిపుణులు మాట్లాడుతూ ఆర్టిజం పిల్లల ప్రత్యేక శ్రద్ధ పెట్టడం వల్ల వారు నేర్చుకోగలుగుతారని వారిని ఎలాంటి ఒత్తిడికి గురి చేయరాదని ఆటిజం పిల్లలు చిన్న వయసులోనే అది నేర్చుకో ఇది నేర్చుకో అలా ఉండాలి ఇలా ఉండాలి అని ఒత్తిడికి గురి చేస్తారు ఈ ఒత్తిడి వల్ల వారు నేర్చుకోలేకపోతారని నార్మల్ పిల్లలు నేర్చుకున్నంత స్పీడ్ గా మీరు నేర్చుకోలేరని వీళ్ళకి రిలాక్స్ మూడ్ లోనే శిక్షణ ఇవ్వాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి ఎస్.సిద్దయ్య మానసిక దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరి లోకల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ బాబా గౌడ్ మరియు స్నేహ సొసైటీ కార్యవర్గ సభ్యులు వీరేశం పాల్గొన్నారు. అంధ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానసిక దివ్యాంగులు వారి తల్లిదండ్రులు సిబ్బంది పాల్గొన్నారు.

# జెల్ల మురళి మరణం శ్రామిక వర్గానికి తీరని లోటు.

**- సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య.**




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఏప్రిల్ 2:**

ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షుడు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జెల్ల మురళి మరణం శ్రామిక వర్గానికి తీరని లోటనీ సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. అనారోగ్యంతో కన్నుమూసిన జెల్ల మురళి అంత్యక్రియలు బుధవారం నగరంలో నిర్వహించారు. అంతకుముందు జరిగిన సంతాప కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడారు. మురళి మరణం కుటుంబ సభ్యులకే కాదు శ్రామిక జనానికి, శ్రమజీవుల అందరికీ తీరనిలోటని అన్నారు. జెల్ల మురళి నిజామాబాద్ పట్టణంలో ఉన్న ప్రింటింగ్ ప్రెస్ లో పనిచేస్తూ కార్మికులకు కనీస కూలీ, వేతనాలు ఇవ్వాలని కార్మికులను కూడగట్టడంలో సంఘం ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర వహించాడని గుర్తు చేశారు. ప్రింటింగ్ ప్రెస్ మురళిగా జిల్లాలో అందరికీ సుపరిచితుడని అన్నారు. మురళి ఆనాటికే మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నాయకుడిగా పనిచేస్తున్న మల్లేష్ నాయకత్వంలో ప్రెస్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేసి వారికి కనీస వేతనాలతో పాటు వారికి నివాసం, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఉద్యమించి సాధించాడనీ, మున్సిపల్ కార్మికుల హక్కులు, వారికి ఉద్యోగ భద్రత లాంటి వాటికోసం కలిసి ఉద్యమించారని తెలిపారు. నగరంలోని ద్వారకా నగర్ గుడిసె వాసుల కోసం, వారి నివాసాలు కాపాడుకోవడంలో వారికి అండగా మురళి జీవితాంతం నిలబడ్డాడని అన్నారు. శ్రామిక నగర్( బోర్గం పి ) కాలనీలో వందలాది మంది పేద ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడంలో ఇళ్ల స్థలాల పోరాటంలో తను భాగస్వాముడై ఆ కాలనీలో తను ఒక్కడిగా ఉంటూ అందరికీ ఇండ్లను సాధించిన దాంట్లో ఆయన కీలక వ్యక్తి అన్నారు. శ్రమజీవులకు కనీస వేతనాలు, కూడు, గూడు గుడ్డ కల్పించాలని పోరాడిన ఆయన యొక్క స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రజల హక్కుల కోసం తనను స్మరించుకుంటూ ఉద్యమిస్తామని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు వేల్పూరు భూమయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ దాసు, జిల్లా అధ్యక్షులు బి భూమన్న , నాయకులు సూర్య శివాజీ, పరుచూరి శ్రీధర్, నీలం సాయిబాబా, ఏం. శివకుమార్, సత్యం, రమేష్, భాస్కర్, జేపీ గంగాధర్ పాల్గొన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీ బంద్.

**హెచ్ సియు భూముల అమ్మకాన్ని నిరసిస్తూ ఎబివిపి ఆందోళన.**

**వేగుచుక్క న్యూస్, డిచ్ పల్లి, ఏప్రిల్ 2:**



హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూముల అమ్మకాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ యూనివర్సిటీ తరగతులు బహిష్కరించి, యూనివర్సిటీ బంద్ చేపట్టారు. తరువాత ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి యూనివర్సిటీ మెయిన్ గేట్ వరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శవయాత్ర నిర్వహించి, దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు బి. శివ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులను, విద్యావ్యవస్థను టార్గెట్ చేస్తూ విద్యా వ్యతిరేక విధానాలను కొనసాగిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు మేధావులంతా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తుంటే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక నియంతల వ్యవహరిస్తూ యూనివర్సిటీ భూములను అమ్మడం దారుణమని అన్నారు. మా భూములు అమ్మొద్దు మా యూనివర్సిటీ భూములను కాపాడాలని శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థుల పైన పోలీసులను పెట్టి మహిళల పైన దాడులు చేయడం సిగ్గుచేటు అని అన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికైనా కళ్లు తెరిచి హైదరాబాద్

సెంట్రల్ యూనివర్సిటీ భూములను, అక్కడున్న వన్యప్రాములను కాపాడి విద్యా వ్యవస్థను బాగు చేయాలని, యూనివర్సిటీ లను గాడిలో పెట్టాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ జాయింట్ సెక్రటరీ సమీర్, అశోక్, అజయ్, యూనివర్సిటీ ఉపాధ్యక్షులు అనిల్ మరియు యూనివర్సిటీ నాయకులు పృధ్వి రోహన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.




వేగుచుక్క న్యూస్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్ సియు భూముల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ డిల్లీలోని జంతర్ మంతర్ లో రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర పార్టీ నాయకులతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు.



# రణ్‌బీర్‌కి జోడీగా?

తనదైన నటనతో ప్రేక్షకుల్ని మెప్పించే అందాల తార కీర్తి సురేశ్.. సినిమాల ఎంపికలో జోరు చూపిస్తోంది. ప్రస్తుతం 'అక్క', 'రివాల్వర్ రీటా' లాంటి వైవిధ్యమైన కథలతో బిజీగా గడుపుతున్న ఆమె.. హిందీలో మరో చిత్రం కోసం చర్చలు చేస్తున్నట్లు ఇటీవలే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు దీని గురించి మరో ఆసక్తికర విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. బాలీవుడ్‌లో తన రాబోయే ప్రాజెక్టు కోసం కీర్తి.. కథానాయకుడు రణ్‌బీర్ కపూర్‌తో జోడీ కట్టనున్నట్లు సమాచారం. చిత్రపరిశ్రమలో మంచి క్రేజ్ ఉన్న వీరిద్దరి కోసం ప్రత్యేకంగా కథను సిద్ధం చేస్తోందట చిత్రబృందం. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే రొమాంటిక్ కామెడీ డ్రామాగా తీర్చిదిద్దుతున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు కీర్తి సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి కీర్తి, రణ్‌బీర్‌లు జంటగా తెరపైకి రాబోతున్నారా?లేదా అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



# అమ్మాయి - అబ్బాయి ఆద్యంతం నవ్విస్తారు



"ఆద్యంతం వినోదంతో నిండిన సినిమా 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' . చాలా సరదాగా సాగుతూ అందర్నీ అలరిస్తుంది" అన్నారు ప్రదీప్ మాచిరాజు. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని నితిన్, భరత్ సంయుక్తంగా తెరకెక్కించారు. మాంక్స్ అండ్ మంకీస్ సంస్థ నిర్మించింది. దీపికా పిల్లి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ ప్రాజెక్ట్ విషయమై ఒక మారుమూల గ్రామానికి వెళ్లిన ఓ సివిల్ ఇంజినీర్ చుట్టూ నడిచే కథ ఇది. అక్కడ తనకెదురైన విచిత్ర పరిస్థితులేంటి.. ఆ ఊర్లో ఉన్న ఒకే ఒక్క అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి తను ఎన్ని తిప్పలు పడ్డాడు అన్నది ఆసక్తికరం. ఈ సందర్భంగా హీరో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ.. "నా టీవీ షోలు చూసి ప్రేక్షకులు ఎంతగా ఎంజాయ్ చేశారో.. అలాగే ఈ చిత్రం కూడా అంతే గొప్పగా అందర్నీ అలరిస్తుంది. కథ బాగా నచ్చి అందరం ఎంతో ఇష్టంగా ఈ సినిమా చేశాం. భవిష్యత్తులో మంచి చిత్రాలు చేయడానికి ఈ సినిమా ఓ మెట్టుగా నిలుస్తుందని భావిస్తున్నాం. ఇది తప్పకుండా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నా" అన్నారు. "ఇది అందమైన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్. కుటుంబ సమేతంగా చూడదగ్గట్లుగా ఉంటుంది" అన్నారు దర్శకులు నితిన్ – భరత్. ఈ కార్యక్రమంలో దీపిక పిల్లితో పాటు పలువురు చిత్ర బృంద సభ్యులు పాల్గొన్నారు.

# అమ్మలకు అంకితమిస్తున్నా.. కల్యాణ్‌రామ్

"అతనొక్కడే' సినిమాలా 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' కూడా అందరికీ గుర్తుండిపోయే చిత్రమవుతుంది" అన్నారు నందమూరి కల్యాణ్‌రామ్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని ప్రదీప్ చిలుకూరి తెరకెక్కించారు. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. సయీ మంజ్రేకర్ కథానాయిక. విజయశాంతి, శ్రీకాంత్, సోహైల్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం నరసరావుపేటలో ఈ చిత్ర తొలి గీతాన్ని విడుదల చేశారు. "చుక్కల చీర చుట్టేసి.. గజ్జల పట్టీలు కట్టేసి.. చెంగుమని నువ్వట్టా నడిచొస్తుంటే" అంటూ హుషారుగా సాగిన ఈ రొమాంటిక్ మాస్ పాటకు అజనీశ్ లోక్‌నాథ్ స్వరాలు సమకూర్చారు. రఘురామ్ సాహిత్యమందించారు. నకాశ్ అజీజ్, సోనీ సంయుక్తంగా ఆలపించారు. శేఖర్ మాస్టర్ నృత్యరీతులు అందించారు. ఈ సందర్భంగా హీరో కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ.. "ఈ చిత్రంలోని మా అమ్మ పాత్రను విజయశాంతి ఒప్పుకోవడం వల్లే ఈ సినిమా చేయగలిగాం. అమ్మల్ని గౌరవించడం మన బాధ్యత. వాళ్ల కోసం ఎంత త్యాగం చేసినా తప్పులేదు. ఈ చిత్రాన్ని అమ్మలందరికీ అంకితం చేస్తున్నా" అన్నారు. "కల్యాణ్‌రామ్‌ను నందమూరి అభిమానులు ఎలా చూడాలని కోరుకుంటారో ఈ సినిమాలో ఆయనలా కనిపిస్తారు. పల్నాటి పౌరుషం మొత్తం తన పాత్రలో ఉంటుంది" అన్నారు దర్శకుడు ప్రదీప్ చిలుకూరి. ఈ కార్యక్రమంలో అశోక్ వర్ధన్ ముప్పా, చదలవాడ ఆదిత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

# వినోదాత్మక కథతో..


కథా బలమున్న చిత్రాలతో అలరిస్తూ.. హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఇప్పుడాయన గోపీ ఆచార దర్శకత్వంలో ఓ సినిమా



చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. బి.నరేంద్ర రెడ్డి నిర్మాత. 'రైటర్ పద్మభూషణ్'తో ప్రశంసలు అందుకున్న షణ్ముక ప్రశాంత్ దీనికి కథ అందిస్తున్నారు. ఇది ఆద్యంతం వినోదాత్మకంగా సాగే బలమైన కథతో రూపొందనున్న సినిమా. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# బేబీ జోరు పెంచుతోంది

'బేబి' సినిమాతో తొలి అడుగులోనే అందం.. అభినయాలతో కట్టిపడేసిన తెలుగందం వైష్ణవి చైతన్య. ప్రస్తుతం ఆమె సిద్ధు జొన్నలగడ్డతో 'జాక్'తో పాటు ఆనంద్ దేవరకొండ – ఆదిత్య హాసన్ కాంబోలో ఓ సినిమా చేస్తోంది. కాగా, ఇప్పుడామె ఖాతాలో మరో రెండు ప్రాజెక్ట్‌లు చేరనున్నట్లు తెలుస్తోంది. వీటిలో ఒకటి నాయికా ప్రాధాన్య చిత్రమని సమాచారం. ఓ కొత్త దర్శకుడు వైష్ణవి కోసం ఓ విభిన్నమైన థ్రిల్లర్ కథ సిద్ధం చేశారని.. అది తనకు నచ్చడంతో సినిమా చేసేందుకు సిద్ధమైందని తెలిసింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడనుంది. మరోవైపు వైష్ణవి చైతన్యను తమిళ తెరకు పరిచయం చేసేందుకు పలువురు దర్శకులు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలో విష్ణు విశాల్ హీరోగా చేయనున్న ఓ సినిమాలో ఆమె నాయికగా కనిపించే అవకాశమున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ చిత్ర విషయమై చర్చలు మొదలైనట్లు తెలిసింది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇదే వైష్ణవికి తొలి తమిళ సినిమా



# రొమాంటిక్ దర్శనమే!




శర్వానంద్, సంయుక్తా మేనన్, సాక్షి వైద్య నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'నారీ నారీ నడుమ మురారి'. 'సామజవరగమన' ఫేమ్ రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే పాటలతో ప్రచార పర్వాన్ని వేగవంతం చేసేందుకు సిద్ధమైంది చిత్ర బృందం. దీనిలో భాగంగానే ఈ చిత్ర తొలి గీతాన్ని ఈ నెల 7న విడుదల చేయనున్నట్లు సోమవారం ప్రకటించారు. "దర్శనమే.." అంటూ సాగే ఈ రొమాంటిక్ పాటను శర్వా – సంయుక్తలపై చిత్రీకరించారు. దీనికి సంబంధించి విడుదల చేసిన కొత్త ప్రచార చిత్రంలో వాళ్లిద్దరి కెమిస్ట్రీ ఆకర్షణగా నిలిచింది. వినోదంతో పాటు కుటుంబ అంశాలతో ముడిపడి ఉన్న కథతో రూపొందిన చిత్రమిది. భాను బోగవరపు కథ.. నందు సవిరిగాన మాటలు అందిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

# భవిష్యత్తు కోసం అంతరిక్షంలో సాహసాలు



బాలీవుడ్ కథానాయకుడు హృతిక్ రోషన్.. 'క్రిష్ 4' సినిమాతో దర్శకుడిగా తొలి అడుగు వేయబోతున్న సంగతి తెలిసిందే. విశేష ప్రేక్షకాదరణ సొంతం చేసుకున్న 'క్రిష్' ఫ్రాంచైజీలో రూపొందుతున్న చిత్రమిది. ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా కోసం కథానాయికగా నోరా ఫతేహిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. దీంతో పాటు ఈసారి భవిష్యత్తును పునర్నిర్మించడానికి క్రిష్ సాహసాలు చేయనున్నాడని సమాచారం. "మునుపటి భాగంలో కాల్‌ని ఓడించిన కొన్ని సంవత్సరాల తర్వాత క్రిష్‌కు కొన్ని శక్తులు వస్తాయి. వీటితో చరిత్రను తిరగ రాయడానికి, దుష్టశక్తి నుంచి మానవాళిని రక్షించడానికి క్రిష్ సాహసాలు చేయాల్సి ఉంటుంది. ఈ టైమ్ ట్రావెల్ కథలో హృతిక్ సరసన నటించడానికి నోరా ఉత్సాహంగా ఉంది. 'కోయీ మిల్‌గయా'లో నిషా పాత్రలో మెరిసిన ప్రీతి జింటా మరోసారి ఆ పాత్రతో ఈ ఫ్రాంచైజీలో అడుగుపెట్టడం మరో విశేషం" అని హృతిక్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

# నిర్మాత ముళ్లపూడి బ్రహ్మానందం ఇకలేరు



తెలుగు చిత్రసీమలో విషాదం చోటు చేసుకుంది. సినీ నిర్మాత ముళ్లపూడి బ్రహ్మానందం (68) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య మంగాయమ్మ, కుమారుడు సతీష్, కూతురు సత్య మాధవి ఉన్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఉన్న కుమారుడు వచ్చాక బుధవారం మహాప్రస్థానం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ముళ్లపూడి బ్రహ్మానందం బావ అవుతారు.